ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



3

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

బుధవారం 4 డిసెంబరు 2024

ప్రాణాలతో చెలగాటం

- పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు కరువు
- రెండేళ్లుగా అందని వైనం
- అనారోగ్యం బారిన పడుతున్న శ్రమజీవులు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



భూపాలపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యాన్ని కాపాడటంలో మునిసిపల్ కార్మికుల పాత్ర కీలకం. వారులేని సమాజాన్ని ఊహించలేం. సూర్యోదయానికి ముందే వీరి దినచర్య మొదలవుతుంది. వీరు ఒక్కరోజు పనిచేయకపోతే ఇబ్బంది పడాల్సిందే. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి కాలనీలన్నీ దుర్వాసన వెదజల్లుతుంది. ఇంట్లోని చెత్త డస్ట్‌బిన్ల నిండి మురికికూపంగా మారాల్సిందే. ఇలా నిత్యం శ్రమించే మునిసిపల్ కార్మికులు నిర్లక్ష్యపు నీడన మగ్గుతున్నారు. వీరి బాగోగులను పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు.

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో 30 వార్డులు ఉన్నాయి. వీటిలో సుమారు 1.20 లక్షల జనాభా, 67వేల మంది ఓటర్లు ఉన్నారు. సుమారు 6 కిలోమీటర్ల పరిధిలో పట్టణం విస్తరించి ఉంది. ఈ క్రమంలో కార్మికులు పారిశుధ్య పనులతోపాటు తాగునీటి సరఫరా చేసేందుకు, ఇతర విభాగాలతో కలిపి మొత్తం 152 మంది పనిచేస్తున్నారు. వీరిలో పరిసరాలను అనునిత్యం శుభ్రపరిచేందుకు 91 మంది కార్మికులు పనిచేస్తుంటారు. 25 మంది స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లపై డ్రైవర్లు ఉన్నారు. ఎలక్ట్రీషియన్లు, పంపు ఆపరేటర్లు కలిపి 28 మంది ఉన్నారు. మరో ఎనిమిది మంది కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. భూపాలపల్లి మునిసిపాలిటీలో జంగేడు, కాశీంపల్లి, వేశాలపల్లి, పుల్లూరిరామయ్యపల్లి గ్రామాలు విలీనమయాయి. వీటిలో ఇంకా 12 శివారు గ్రామాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిలో 91మంది మాత్రమే పారిశుధ్య పనులు చేస్తున్నారు. డ్రైవర్లు 25 మంది ఉన్నప్పటికీ వారి సంఖ్యకు సరిపడా వాహనాలు లేవు.

రెండేళ్లుగా అందని కిట్లు

మునిసిపల్ కార్మికులు ప్రతిరోజూ రోడ్డుపై, కాలనీల్లో వచ్చే దుమ్ముధూళిలోనే వీరు పనిచేస్తుంటారు. దుర్వాసన వెదజల్లే కాల్వలను శుభ్రపరచడం, ఇళ్లల్లోని చెత్తను సేకరించడం లాంటి విధులు నిర్వర్తిస్తుంటారు. ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా ప్రతి ఆరు నెలలకోసారి వారికి గ్లౌజులు, కొబ్బరినూనె, బెల్లం, బూట్లు, సబ్బులు, మాస్కులు ఇతరత్రా వస్తువులు ఇవ్వాల్సి ఉంది. శీతాకాలం చలిని తట్టుకునేందుకు స్వెటర్లు, వర్షానికి రక్షణ కవచంగా ఉండే జర్కిన్లు కూడా ఇవ్వాల్సి ఉంది. అలాగే ప్రతి ఏడాది రెండు జతల దుస్తులు అందించాల్సి ఉంది. సీజన్‌కు అనుగణంగా ఈ కార్మికులకు రక్షణ పరికరాలు సమకూర్చాల్సి ఉంది. కానీ రెండేళ్లుగా తమకు రక్షణ పరికరాలు ఇచ్చిన దాఖలాలు లేవని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు రక్షణ పరికరాలు ఇవ్వకపోవడంతో అనారోగ్య బారిన పడుతున్నామని మునిసిపల్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు చుట్టుముడుతుండటంతో జీతమంతా ఆస్పత్రికే ఖర్చు చేయాల్సి వస్తోందని అంటున్నారు.

డ్రైవర్ల పరిస్థితీ అంతే...

స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు కూడా దీనస్థితినే ఎదుర్కొంటున్నారు. ఏదైనా వాహనం పాడైతే దానిని వెంటనే రిపేరు చేపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గట్టిగా అడిగితే ఉద్యోగాలు ఉంటాయో పోతాయోననే భయంతో కొట్టుమిట్టాడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వాహనాల సంఖ్య తక్కువగా ఉండటంతో తీవ్ర పని ఒత్తిడి అవుతోందని అంటున్నారు. జంగేడులో ఏడు వార్డులకు ఒకే ట్రాక్టర్ పనిచేస్తోంది. మంజూర్‌నగర్ పరిధిలోని తొమ్మిది గ్రామాలకు కూడా ఒకే ట్రాక్టర్ పనిచేస్తోంది. దీంతో తమపై పనిభారం పడుతోందని తెలిపారు. మునిసిపల్ పాలకవర్గం, అధికారులు ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది కోరుతున్నారు.



ఎస్సీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



వార్డెన్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్

కాటారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్ మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. హాస్టల్‌లో కల్పిస్తున్న వసతి, సౌకర్యాలు, భోజనం అందిస్తున్న తీరును పరిశీలించారు. ఇటీవల హాస్టల్‌లో జరిగిన సంఘటనపై విద్యార్థులు, హెచ్‌డబ్ల్యూవోను ఆరా తీశారు. విద్యార్థినులు భయాందోళనలకు కారణమైన వాచ్‌ఉమన్‌ను హాస్టల్‌కు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సీడబ్ల్యూడీవో సునీతను ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించాలని వార్డెన్ భవానికి సూచించారు.

నేటి నుంచి అవినీతి నిర్మూలన వారోత్సవాలు



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 3 నుంచి 9 వరకు జరిగే అవినీతి నిర్మూలన వారోత్సవాలను నిర్వహిస్తునానమని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్.దివాకర కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన తన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. ములుగును అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు ఏసీబీ అధికారులకు సహకరించాలని అన్నారు. ఎవరైనా లంచం అడిగితే ఇవ్వొద్దని, డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా వరంగల్ రేంజ్ ఏసీబీ అధికారి ఫోన్ నంబర్ 9154388912కు సమాచారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, వరంగల్ రేంజ్ ఏసీబీ సీఐ రాజు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

చల్పాక ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ..
ఈ నెల 5న తీర్పు

4

బాణసంచా పేలి బాలుడికి తీవ్రగాయాలు



కాలిన గాయాలతో యశ్వంత్

కాటారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బాణసంచా పేలి బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికంగా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న తాళ్లపల్లి మహేందర్ ఎనిమిదేళ్ల కుమారుడు యశ్వంత్ గతంలో పలువురు పేల్చిన టపాసులను ఏరుకుని వచ్చి మంట పెట్టాడు. ఇందులో గతంలో పేలకుండా ఉన్న బాణసంచా ఒక్కసారిగా పేలడంతో బాలుడికి ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని 108లో భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. వారి సూచన మేరకు అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఈఎంటీ రాజు, పైలట్ విజయ్‌కుమార్ తెలిపారు.

దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఇళ్లు లేని దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. భూపాలపల్లిలోని సమీకృత కలెక్టరేట్‌లో దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనేక పథకాలు అమలు చేస్తామన్నారు. త్వరలోనే పెన్షన్ పెంపు సహాయం అందుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎవరైతే ఇళ్లు లేకుండా ఉన్నారో వారి జాబితా అందిస్తే తప్పకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసు కోవాలని అన్నారు. అనంతరం ఇటీవల నిర్వ హించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను ఎమ్మెల్యే, కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, చల్ల రేణుక, నాయకులు బీర్తి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో ఆగ్రహావేశాలు

అంతర్జాతీయ దివ్యాంగుల వేడుకల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దివ్యాంగులను సంబంధిత శాఖలోని జూనియర్ అసిస్టెంట్ చిన్నచూపు చూస్తున్నారంటూ వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ ఆరోపించారు. దీనిపై స్పందిస్తూ లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు దివ్యాంగులకు బహుమతులు అందించే క్రమంలో హెచ్ఎంఆర్‌డీఎస్ నిర్వాహకులు బహుతుల ప్రదానం విషయంలో అధికారుల తీరుపై మండిపడ్డారు. ఆటల్లో పాల్గొనని వారికి కూడా బహుమతులు ఇచ్చారని, తొలుత బాలలకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాత పుస్తకం ఆవిష్కరణ

దివ్యాంగుల హక్కులపై ముద్రించిన పుస్తకాన్ని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆవిష్కరించారు. అయితే.. దీనిపై 'దివ్యాంగుల హకుకల చట్టం-2016' అని టైటిల్ ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ పుస్తకాన్ని ముద్రించగా పాతదానినే ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత అధికారులు ఆవిష్క రింపజేశారు. ఈ పుస్తకం మొదటి పేజీలో అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫొటోతో సందేశం ఉంది. ఇవన్నీ గమనించని ఎమ్మెల్యే, కలెక్టర్ ఆ పాత పుస్తకాన్ని ఆవిష్కరించారు. డీడబ్ల్యూవో నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగ్గా దీనిపై పలువురు విస్మయాన్ని వ్యక్తం చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌కాలనీకి చెందిన రేవెళ్లి రమేష్ (35) కొన్నేళ్ల క్రితం నర్సంపేటకు చెందిన సృజనను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్ కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో వారం రోజుల క్రితం భార్య సృజన పిల్లలను తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన సోమవారం రమేష్ ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని తొలుత వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్న క్రమంలో రమేష్ మంగళవారం మృతి చెందాడు. మృతుడి బావ కేతిరి పోషాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్‌కుమార్ వెల్లడించారు. ఆత్మహత్యకు ముందు రమేష్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. భార్య తనతో గొడవపడి దూరంగా ఉండలేకపోతున్నానని, దీంతో చనిపోతున్నానని రికార్డు చేశాడు. ఇద్దరు పిల్లలను బాగా చూసుకోవాలని వేడుకుంటూ బంధువులు, సన్నిహితులకు వీడియోను పంపినట్లు తెలిసింది.

కాంగ్రెస్ గ్యారెంటీలపై బీజేపీ చార్జ్‌షీట్



ములుగులోని బీజేపీ కార్యాలయంలో చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షుడు బలరాం

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వందరోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలు, 66హామీలు, 420 ఉప హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం చార్జ్‌షీట్ విడుదల చేశారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని హామీల అమలుపై మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4,5తేదీల్లో నియోజకవర్గంలోని పలు మండలాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ నెల 4న ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలు, 5న తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాలు కలుపుతూ బైక్ ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యపరచనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శీలమంతుల రవింద్రచారి, భర్తాపురం నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, క్రియాశీల ప్రముఖ్ భూక్య జవహర్‌లాల్, నాయకులు కొత్త సుధార్‌రెడ్డి, ఓమ్రా, గుగులోత్ స్వరూప, రాయంచు నాగరాజు, దండిగ వెంకన్న, లడే శ్రీనివాస్, గండేపల్లి సత్యం, కర్ర సాంబశివరెడ్డి, కత్తి హరీష్, గాధం కుమార్, శరత్, రఘు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర వంతెనల వద్ద నిఘా

- వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు
- ఎన్‌కౌంటర్ నేపథ్యంలో అప్రమత్తం

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 3: ములుగు జిల్లా చల్పాక ఎన్‌కౌంటర్, మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అలర్ట్ అయ్యారు. మండలంలోని మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దులో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అంతర్రాష్ట్ర వంతెనల వద్ద పటిష్ట నిఘాను పెంచారు. మంగళవారం సాయంత్రం బొమ్మాపూర్ మలపు వద్ద ఎస్సై పవన్‌కుమార్ నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టి పత్రాలు లేని వాటికి జరిమానాలు విధించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను విచారించారు. ఎస్సై వెంట సివిల్, సీఆర్‌పీఫ్ సిబ్బంది ఉన్నారు.



బొమ్మాపూర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు



బోగీల మధ్య కప్లింగ్ ఊడిపోవడంతో ఆగిన గూడ్స్ రైలు

ఊడిపోయిన గూడ్స్ రైల్ కప్లింగ్

- 10 నిమిషాల్లో మరమ్మతు
- మానుకోటలో ఘటన

నెహ్రూసెంటర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గూడ్స్‌రైల్ డబ్బాల మధ్య ఉన్న లింక్ తెగిపోవ డంతో రెండుగా విడిపోయింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 436/12బీ క్యాబిన్ వద్ద మంగళవారం ఉదయం 8.30 గంటలకు చోటు చేసుకుంది. రైల్వే అధికారులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ వైపు నుంచి మహబూబాబాద్ మీదుగా రామగుండం వెళ్లుతుండగా, ఓ గూడ్స్ రైలుకు డబ్బాల మధ్యలో ఉండే కప్లింగ్ ఊడిపోయింది. దీంతో రైలు బోగీలుగా రెండుగా వీడిపోయాయి. గమనించిన గార్డు వెంటనే రైలును నిలిపివేసి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన రైల్వేసిబ్బంది 10 నిమిషాల్లో పనులను పూర్తి చేశారు. అనంతరం గూడ్స్‌రైలు రామగుండం వైపు వెళ్లిపోయింది. ఆ సమయంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోవడంతో ఆలస్యం జరుగలేదు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

విద్యా శాఖ కమిషన్ సభ్యుడు విశ్వేశ్వరరావు



కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న విశ్వేశ్వరరావు, అధికారులు ←

పెద్దవంగర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని విద్యాశాఖ కమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం చిన్నవంగరలోని కేజీబీవీ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని, భోజనశాల, వంటశాల, తరగతి గదులతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలను తయారు చేస్తామన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో ఉంటున్న విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహస్వామి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, గిరిజన శాఖ అధికారి సైద, కేజీబీ కోఆర్డినేటర్ విజయకుమారి, తహసీల్దార్ వి. మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత జిల్లాగా మార్చాలి

మహబూబాబాద్ డీఎంహెచ్‌వో మురళీధర్

బయ్యారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మానుకోటను కుష్టు రహిత జిల్లాగా నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మురళీధర్ వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆషాడే కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెప్రసీ కేస్ డిటెక్షన్‌లో భాగంగా కుష్టు రహిత జిల్లాగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. పక్షోత్సవాల భాగంగా ప్రతి ఆశ కార్యకర్త రోజు 30 ఇండ్లను సందర్శించాలన్నారు. ఇంట్లో ఎవరికైనా మొద్దు బారిన మచ్చలు, రాగి వర్ణం గల స్పర్శలేని మచ్చలుంటే ప్రాథమిక ఆరోగ్యానికి తరలించాలన్నారు. త్వరగా గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడే వారు అవుతారని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో స్త్రీ పురుష నిష్పత్తి తక్కువగా ఉందని అబార్షన్ అయిన వారి ఇంటిని సందర్శించి వివరాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ జ్యోతి, హెల్త్ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలిస్తున్న మురళీధర్

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

- చల్పాక ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ
- ఈ నెల 5న తీర్పు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న పరిణామాలు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలం రేపిన చల్పాక ఎన్‌కౌంటర్ హైకోర్టు మెట్లెక్కింది. ఈ నెల 1న చల్పాక అడవుల్లో పొలాకమ్మ వాగు సమీపంలో గ్రేహౌండ్స్ బలగాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం రాష్ట్రంలో కలకలం రేపింది. ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం మావోయిస్టు పార్టీకి భారీ నష్టాన్ని మిగిల్చింది. పీఎల్‌జీఏ వారోత్సవాల వేళ మావోయిస్టు పార్టీ ఏడుగురిని కోల్పోవడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఏజెన్సీ ప్రాంతంపై పూర్తిస్థాయిలో పట్టున్న ఇద్దరు అగ్రనాయకులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం మావోయిస్టు పార్టీకి అగాథంలోకి నెట్టినట్లయింది.

పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా ఏటూరునాగారం- మహదేవపూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా ఎన్‌కౌంటర్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేయడం, ఎన్‌కౌంటర్ బూటకమని, తన భర్తను పోలీసులు విష ప్రయోగం చేసి చిత్రహింసలు పెట్టారని హైకోర్టులో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పిటిషన్ ధాఖలు చేశారు.



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం

అభ్యంతరాలు లేకుంటే మృతదేహాలను తీసుకెళ్లొచ్చు..

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మిగతా వారి బంధువులకు ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే వారి మృతదేహాలను బంధువులు స్వాధీనం చేయవచ్చని హైకోర్టు తెలిపింది. మిగతా ఆరుగురు మృతదేహాల బంధువుల్లో ఏ ఒక్కరు అభ్యంతరం తెలిపినా తీర్పు వెలువరించే వరకు మృతదేహాన్ని భద్రపర్చాలని కోర్టు తెలిపింది. కానీ ఆరుగురిలో వారి బంధువులు ఎన్‌కౌంటర్‌పై ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పోలీసుల తరపు లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లగా కోర్టు మృతదేహాలను వారి బంధువులకు అప్పగించొచ్చని తెలిపింది. దీంతో పోలీసులు ఆరుగురి మృతదేహాలను వారి బంధువులకు సమాచారం అందించగా అందులో నలుగురు మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు.

ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ

ఏటూరునాగారం- మహదేవపూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య ఈగోలాపు మీనా ఎన్‌కౌంటర్ బూటకమని, దీనిపై విచారణ చేపట్టాలని ఈనెల 2 వతేదీన హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేయగా హైకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. చల్పాక ఎన్‌కౌంటర్ పచ్చి బూటకమని, విష ప్రయోగం ద్వారా మావోయిస్టులను పోలీసులు హతమార్చడం జరిగిందని పిటిషన్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. సిట్టింగ్ జడ్జి సమక్షంలో రీ పోస్టుమార్టం చేపట్టాలని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఈ కేసును ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసి పూర్తి సమాచారాన్ని కోర్టుకు అందచేయాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పు వెలువరించే వరకు మృతదేహాన్ని మార్చురీలోనే భద్రపరచాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

తీర్పు పోలీసులకు సవాల్

ఎన్‌కౌంటర్‌పై హైకోర్టు తీర్పు పోలీసులకు సవాలుగా మారనుంది. గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరగడం ఏడుగురు మావోయిస్టులు మృతి చెందడం పోలీసు శాఖ తరపున అన్ని సవ్యంగా జరిగాయి. కానీ ప్రజాసంఘాలు, ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా అనూహ్యంగా ఎన్‌కౌంటర్ బూటకమని హైకోర్టుకు వెళ్లడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఎన్‌కౌంటర్ జరిగి న రోజు నుంచి పోలీసులు నిర్విరామంగా మావోయిస్టు మృతదేహాల తరలింపు, పోస్టుమార్టం, బంధువులకు అప్పగించడం తదితర అంశాల్లో నిమగ్నమయ్యారు. మృతదేహాలను వారి బంధువులకు అప్పగిస్తే పని పూర్తయినట్లనని భావించిన పోలీసులకు అనుకోని విధంగా ఈ కేసు కోర్టు మెట్లెక్కింది. హైకోర్టు తీర్పును మరొక రెండు రోజులు వాయిదా వేయడంతో పోలీసులు మల్లాగుల్లాలు పడుతున్నారు. కోర్టు ఏవిధంగా వస్తుందో ఇంకెన్నీ ఈ ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు భావిస్తున్నారు. చల్పాక ఎన్‌కౌంటర్‌పై ప్రజాసంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఎన్‌కౌంటర్ బూటకమని వాదనలు వినిపిస్తున్న ప్రజా సంఘాలు, పక్కా ఎన్‌కౌంటరేనని పోలీసుల వాదనలో కోర్టు తీర్పు ఏ విధంగా ఉంటుందోనని పలువురు ఆసక్తిగా చూస్తున్నారు.

ఇనుగుర్తి మండలానికి త్వరలో ఠాణా

పోలీస్‌స్టేషన్ ఏర్పాటునకు ప్రతిపాదనలు



పీఎస్ కోసం పరిశీలించిన హాస్టల్ భవనం

ఇనుగుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటైన ఇనుగుర్తి మండలానికి త్వరలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కాబోతోంది. కేసముద్రం మండలంలోని ఇనుగుర్తి, కోమటిపల్లి, నెల్లికుదురు మండలంలోని నాగారం, చెట్లముప్పారం రెవెన్యూ గ్రామాలు, 14 గ్రామపంచాయతీలతో కొత్త మండలంగా 2022లో ప్రభుత్వ ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ మేరకు అదే ఏడాది డిసెంబర్, 4న నూతన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలు అట్టహాసంగా ప్రారంభించారు. ఇనుగుర్తి మండలానికి రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్ నియామకం ఆ తర్వాత మిగతా శాఖల ఏర్పాటుకు చాలా నెలల సమయం పట్టింది. కొద్ది నెలల క్రితం వ్యవసాయ, విద్యాశాఖలను ఏర్పాటు చేసి ఆయా శాఖలకు మండల అధికారులను సైతం ప్రభుత్వం నియమించింది. గతనెల 26న ఇనుగుర్తికి మండల ప్రజాపరిషత్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిన విషయం విధితమే. నూతన మండలానికి అవసరమైన కీలకమైన శాఖల్లో పోలీస్ శాఖ ఏర్పాటు మాత్రమే మిగిలింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటునకు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదల కాగానే ఇనుగుర్తిలో ఠాణా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. మండలం ఆవిర్భావం సమయంలో స్థానిక బాలుర హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా పీఎస్ ఏర్పాటు కోసం అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఏదేమైనా త్వరలోనే ఇనుగుర్తిలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో పూర్తిస్థాయిలో మండలం రూపు సంతరించుకోనుంది.

సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలి

తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్

ఏటూరునాగారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌టీ నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్ అన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ గిరిజన భవన్‌లో తుడుందెబ్బ అత్యవసర మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలో చాలా ఏళ్లుగా సీఆర్‌టీలుగా ఆదివాసీలు పని చేస్తున్నారని, సీఆర్‌టీ ఉద్యోగులను వేకెన్సీ లేదని, సబ్జెక్టు టీచర్లకు ఖాళీ లేదని సాకుతో 15 ఏళ్లుగా పని చేస్తున్న వారిని విధుల నుంచి తొలగించారని ఆయన ఆరోపించారు. ఈ నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేసి గతంలో పని చేసి రెన్యువల్ కానీ మాజీ సీఆర్‌టీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత చట్టాలకు విరుద్ధంగా నోటిఫికేషన్ జారీ చేసిన ఐటీడీఏ డీడీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకే అవకాశం లేకుండా నోటిఫికేషన్ జారీ చేయడం చట్ట విరుద్ధమని ఈ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో ఈ నెల 9న వేల మంది ఆదివాసీ నిరుద్యోగులతో కలిసి ఐటీడీఏను ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సోలం సురేష్, మంగపేట మండల ఉపాధ్యక్షుడు సోలం ఆగబోయిన సాయి కుమార్, సీనియర్ నాయకులు కోరం నాగేశ్వరరావు, వజ్జ రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న ధాన్యం

- కొత్తగూడ మండలంలో 23 సెంటర్ల ఏర్పాటు
- వడ్లను భారీగా తీసుకొస్తున్న రైతులు



పాగుళ్లపల్లిలో కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన ధాన్యం

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తుతోంది. వరికోతలు ఊపందుకోవడంతో ఆయా సెంటర్లకు రైతులు వడ్లను భారీగా తీసుకువస్తున్నారు. సన్నాలకు రూ.2320 మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తోండటంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధానం విక్రయిస్తున్నారు. కలెక్టర్ స్థాయి అధికారి నుంచి క్షేత్ర స్థాయి అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో..

కొత్తగూడ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో పాగుళ్లపల్లి, గుండం, సాధిరెడ్డిపల్లి, రేణ్యాతండా, ముస్మీ, దుర్గారం, ఎదుళ్లపల్లి, కొత్తపల్లి, వేలుబెల్లి, మైలారం, బత్తులపల్లిలో ఏర్పాటుచేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో రాంపూర్, కోనాపురం, రౌతుగూడెం, కార్లాయి, చెరువుముందుతండా, గోవిందాపురం, ఎంచగూడెం, తిమ్మాపురం, జీసీసీ ఆధ్వర్యంలో ఎదుళ్లపల్లి, ఓటాయి, కొత్తగూడ, రామన్నగూడెం, వేలుబెల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

టోకెన్లు ఇస్తున్న ఏవో, ఏఈవోలు..

ధాన్యం విక్రయించుకునేందుకు రైతులు వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరగకుండా నిబంధనల ప్రకారం ఏవో, ఏఈవోలు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంటూ టోకెన్‌లు ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్‌తో రైతులు దుమ్ము, చెత్తలేకుండా చేస్తున్నారు. ఏఈవోలు తేమశాతం పరిశీలించిన అనంతరం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసి రైతుల వివరాలు 'ఆన్‌లైన్'లో పొందుపరచటంతో సరైన సమయంలో రైతుఖాతాలో డబ్బులు జమ చేస్తున్నారు. అనంతరం రెండు, మూడు రోజుల్లో బోనస్ సైతం పడుతోండటంతో రైతులకు అదనపు ఆదాయం వస్తుందని బోనస్ పడిన రైతులు అనందపడుతున్నారు.

పాఠశాలల్లో పోస్టులు భర్తీ చేయాలి

టీఎస్‌జీహెచ్ఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాశ్

భూపాలపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ కోరారు. భూపాలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆ సంఘం సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్, శాశ్వత అటెండర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి భర్తీ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్, సదాశివరావు, మనోహర్ నాయక్, దేవా, రవీందర్‌రెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షలతో ఇంటికి నిప్పు

కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు



దగ్ధమైన టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనం

పెద్దవంగర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాతకక్షల కారణంగా ఇంటికి నిప్పు పెట్టిన ఘటన పెద్దవంగర మండలంలో జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలతండాలో జాటోత్ రవి- కల్యాణి దంపతులు ఉండగా, వారికి అదే తండాకు చెందిన కల్యాణికి అన్న అయిన మాలోత్ రమేష్‌లో కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పాత కక్షలను మనసులో పెట్టుకున్న రమేష్ ఈనెల 1న రవి దంపతులను బెదిరింపులకు గురి చేసి రాత్రి సమయంలో వారు ఉంటున్న ఇంటికి, ద్విచక్రవాహనానికి నిప్పుఅంటించాడు.

ఈ ఘటనలో ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైనట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు. దగ్ధమైన ద్విచక్ర వాహనం విలువ రూ.30 వేల వరకు ఉంటుందన్నారు.

మృతుడి స్మారకార్థం హెల్మెట్ల పంపిణీ

- రోడ్డు ప్రమాదంలో గత ఏడాది యువకుడి దుర్మరణం
- ఆ స్థితి ఎవరికీ రావద్దని కుటుంబ సభ్యుల వితరణ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

కాటారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. హెల్మెట్ ధరించకపోవడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో తల్లడిల్లిన అతడి కుటుంబం ఆ పరిస్థితి ఎవరికీ రావద్దని వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసింది. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రతాపగిరి గ్రామానికి చెందిన బండెల లతీష్ (18) గత ఏడాది బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది.

హెల్మెట్ ధరిస్తే అతడు మృతి చెందేవాడు కాదని, ఈ స్థితి మరెవరికీ రావద్దని భావించింది. మంగళవారం ఆ యువుడి ప్రథమ వర్థంతి సందర్భంగా హెల్మెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లతీష్ కుటుంబ సభ్యులు, స్నేహితులు వేల్పుల రాజేందర్, గుంటి చందు, లక్ష్మణ్‌రెడ్డి, రవి, గుంటి అశోక్, గాలి సత్యం, కోడూరు సతీష్, వేముల మధుకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీరుస్తూ.. పథకాలు అమలు చేస్తున్నాం

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ చేసిన అప్పులు తీర్చుతూనే ప్రజాసంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా మరిపెడ మునిసిపల్ కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించి పారిశుధ్య కార్మికులకు కిట్లు అందచేసి సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలప్పుడు చెప్పిన విధంగా ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. డోర్నకల్ నియోజకవర్గానికి సంవత్సరంలోపే రూ.100కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, మాజీ సర్పంచ్ రాంలాల్, మాజీ ఎంపీటీసీ అంబరీశ, నాయకులు అఫ్జల్, అప్సర్, గంగయ్య, రవికాంత్, మునిసిపల్ వైస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, కమిషనర్ నరేశ్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రగతి శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

డోర్నకల్ : డోర్నకల్ నియోజకవర్గాన్ని రూ.200 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ ర్యాలీలో భాగంగాస్థానిక రైల్వేసెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2 లక్షల లోపు ఉన్న రైతు రుణాలను మాఫీ చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మహిళలకు సంవత్సరానికి ఒక బతుకమ్మ చీర మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్‌చైర్మన్ కె.కోటిలింగం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కాల సుమీర్ చంద్‌జైన్, నాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, బత్తుల శ్రీనివాస్, సుశీల్ కుమార్‌జైన్, సత్తిరెడ్డి, బషిక అశోక్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్


పొద్దు తిరుగుడు, మొక్కజొన్న చేను

ఆరుతడి పంటల్లో నీటి పారుదల ప్రాధాన్యం

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : యాసంగిపైర్లకు నీటి తడులను సక్రమంగా అందిస్తేనే మొక్కల ఎదుగుదల, దిగుబడి బాగుంటుంది. ఆరుతడి పంటల్లో మేలైన నీరు పారుదల విధానాలను శాస్త్రవేత్త డాక్టర్ పి.మధుకర్‌రావు వివరించారు. పప్పు దినుసుల పంటలకు నాలుగైదు తడులివ్వాలి. పైరు మొగ్గతొడిగే దశ, కాయ దశల్లో నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తపడాలి. వరిమాగాణుల్లో విత్తుకున్న పెసర, మినుముకు నేల రకాన్ని బట్టి రెండు, మూడు నీటి తడులు వదలాలి. వేరుశనగ పూత, ఊడలు దిగే, గింజలు ఏర్పడే దశల్లో నీటితడులు ఇవ్వాలి. పంటకు తుంపర సేద్య పద్ధతి అనువుగా ఉంటుంది. మక్కకు తేలిక నేలల్లో 14 తడులు నల్లల నేలలు, బరువైన నేలల్లో 6-8 తడులు ఇవ్వాలి.

విత్తిన నెల రోజులకు, పైరు పెరిగే, మోకాలి ఎత్తు, జల్లు, గింజకట్టు దశల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి. దుక్కి దున్నకుండా జీరోటిల్లేజీ పద్ధతిలో మక్కలో 45, 60, 80, 90 రోజులకు నీటి తడులను పారించాలి. విత్తిన నెల రోజుల వరకు నీరు నిల్వలేకుండా చూడాలి. పొద్దు తిరుగుడు పైరు మొగ్గదశ అభివృద్ధి సరిగా ఉండాలంటే మలిదశలో సమృద్ధిగా నీరు అందించాలి.


పూత, గింజకట్టు దశల్లో నీరం దకుంటే ఉత్పత్తి, గింజల్లో నూనె శాతం తగ్గుతుంది. కాబట్టి తగిన తడులివ్వాలి. కీలక దశల్లో నీటినందించడం ద్వారా గింజల్లో మాంసకృత్తులు, అమైనో ఆమ్లాలు వృద్ధిచెందుతాయి. నువ్వు పూత, కాయ అభివృద్ధి, గింజ నిండుకునే దశల్లో నీటి ఎద్దడి ఉండవద్దు. విత్తిన వెంటనే మొదటి నీటి తడినిచ్చి 20, 35, 45, 60 రోజులకు మళ్లీ అందించాలి. రకాల కాలపరిమితిని బట్టి దీర్ఘకాలిక రకానికి ఒక తడి ఎక్కువగా అవస రం ఉంటుంది. రైతులు వృథా నీటిని నేలలో ఇంకేలా పొలాల వందూరు ప్రాంతంలో నీరింకే గుంతలను ఏర్పాటు చేసుకోవాలి.

బిందు సేద్యం వల్ల 25-40 శాతం నీరు ఆదా కావడం, దిగుబడి పెరగడం, ఎగుడు దిగుడు భూముల్లోనూ ఇబ్బందులు లేకుండా పైర్లకు నీరందటం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.



సీతాఫలం.. ఆరోగ్య ఫలం..!

- చలికాలంలో విరివిగా లభ్యం
- పుష్టిగా క్యాలరీస్, విటమిన్ - సి



వర్ధన్నపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్‌లో లభించే మృదు మధుర ఫలం సీతాఫలం. దీనినే కస్టర్డ్ ఆపిల్, చికుఫల్ అని కూడా పిలుస్తారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతీ ఒక్కరు తినే మధుర ఫలం. ఇది సెప్టెంబరు నుంచి జనవరి వరకు లభిస్తుంది. ఈ పండ్ల ధర కూడా ఒకప్పుడు చాలా తక్కువే. కానీ వీటి పెంపకాలు తక్కువ కావడంతో ధరలు మండిపోతున్నాయి. ఇప్పుడు కిలోకు రూ.100-150 వరకు రేటు పలుకుతోంది. సీతాఫలం అనేక రోగాలకు ఔషధంలా పనిచేస్తుంది. దీని ఫలమే కాకుండా ఆకులు, విత్తనాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. సీతాఫలంలో ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. గ్రామాల నుంచి అడవుల్లో విరివిగా కాసే ఈ పండ్లను తీసుకువచ్చి నగరాల్లో, మండల కేంద్రాల్లో, రోడ్ల పక్కన ఎక్కువగా అమ్ముతారు.



సీతాఫలంలో ఉండే పోషకాలు ఇవే

క్యాలరీస్	93 శాతం
కొవ్వు పదార్థాలు	0.3 గ్రాములు
కొవ్వు ఆమ్లాలు	0 గ్రాములు
కొలెస్ట్రాల్	0 గ్రాములు
సోడియం	9 మిల్లీ గ్రాములు
పొటాషియం	274 మిల్లీ గ్రాములు
పిండి పదార్థాలు	24 గ్రాములు
పీచు పదార్థాలు	4.4 గ్రాములు
మాంసకృత్తులు	2.1 గ్రాములు
విటమిన్ - సీ	36.3 గ్రాములు
విటమిన్ -బీ6	0.2 గ్రాములు
ఐరన్	0.6 మిల్లీ గ్రాములు
కాలియం	24 మిల్లీ గ్రాములు
మెగ్నీషియం	21 మిల్లీ గ్రాములు

ఉపయోగాలు

- సీతాఫలంలో విటమిన్-సీ, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ వంటి పోషకాలు అధికంగా ఉండడం వలన ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.
- రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది. విటమిన్-సీ ఉండటం వలన తెల్ల రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది.
- గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది.
- జీర్ణక్రియకు సహాయపడుతుంది. సీతాఫలంలో ఫైబర్ అధికంగా ఉండటం వలన మలబద్ధకం, అతిసారం వంటి జీర్ణ సమస్యలు సమసిపోతాయి.
- రక్తపోటు స్థాయిలను నియంత్రిస్తుంది. దీనిలో ఉండే పొటాషియం, మెగ్నీషియం రక్తనాళాలను విడదీసి సాధారంగా పని చేయడానికి సహాయ పడుతుంది.
- విటమిన్-ఏ అధికంగా ఉండడంతో కంటి చూపు మెరుగుపడుతుంది. చర్మం, జుట్టును ఆరోగ్యంగా ఉంచుతుంది.
- చలికాలంలో సీతాఫలం తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అనేక వ్యాధులు నయం చేయడంలో ఈ పండు దోహదపడుతుంది.

మేలైన యాజమాన్యం పాటిస్తే మేలు

- మామిడిలో అధిక దిగుబడులు
- పూత దశలో ఆశిస్తున్న చీడపీడలు
- నివారణకు సస్యరక్షణ చర్యలు




తిరుపతి, ఉద్యానశాఖ అధికారి

వర్ధన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన సమయం ఆసన్నమైంది. పూత రావడానికి వాతావరణ పరిస్థితులు ఎంతగానో ప్రభావం చూపుతాయి. చెట్లకు పూత పూయించడానికి, వచ్చిన పూత ఆగడానికి, కాపు సరిగా రావడానికి పూత దశలో ఆశించే చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా పూత సరిగా రాక, అరకొరగా వచ్చిన పూత నిలవక దిగుబడి తగ్గిపోతుందని వర్ధన్నపేట డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మామిడి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబరు నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి నివ్వాలి. ఆ సమయంలో చెట్టుకు అం తరాయం కలిగిస్తే పూతరావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

సాధారణంగా మామిడి చెట్లకు డిసెం బరు, జనవరిలో పూత ప్రారంభమై ఫిబ్రవరి వరకు పూస్తాయి. ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పుడు పూమొగ్గలను ఉత్తేజపరిచేందుకు డిసెంబరు రెండో పక్షంలో లీటరు నీటికి 10 గ్రాముల మల్టీ-శే (పొటాషియం, నైట్రేట్), 5 గ్రాముల యూరియా కలిపి చెట్ల పైరెమ్మలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. యూరియా మల్టీ-శేలోని నత్రజని, పొటాషి యం పోషకాలు కలిసి పూమొగ్గలను ఉత్తేజ పరుస్తాయి. దీంతో చెట్లకు పూత అధికంగా రావడానికి, పిందె కట్టడానికి కాయలు మంచి సైజులో నాణ్యతగా ఎదగడానికి సహకరిస్తాయి.

చీడపీడల నివారణకు..

సాధారణంగా మామిడి చెట్లను పూత దశలో బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, పూత కాండం, పూల మీద, చిరు పిందెల మీద, తెల్లని పౌడర్ లాంటి బూజు చేరుతుంది. దీనినే బూడిద తెగులు అన్నారు. ఇది ఎక్కువగా ఉన్నపుడు ఆశిస్తుంది. ఈ తెగులు ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగలు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. ఈ తెగులు వల్ల చెట్లకు వచ్చిన పూత, కాత రాలిపోతుంది. దీని నివారణకు పూత దశలో తెగులు కనిపించగానే హెక్సాకోనజోల్ 2. ఎంఎల్, లేదా ప్రొసికోనజోల్ 1 ఎంఎల్, లేదా డినోకాఫ్ 1 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారి చేయాలి.

పూత ఏపుగా రావడానికి..

మామిడి చెట్లకు పూత ఏపుగా రావడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. తోటల్లో తేనెటీగ పట్టుల ఏర్పా టుకు తేనెటీగల సంచారం పెరిగి పరపరాగ సంప ర్కం అధికంగా జరుగుతుంది. దీంతో పూత ఏపుగా రావడానికి వీలవుతుంది. తద్వారా దిగుబడి 20 నుంచి 30 శాతం పెరిగేందుకు ఆస్కారం ఉం టుంది. తోట నలుమూలల తేనెపట్టులను ఏర్పా టు చేసుకోవడం వల్ల ఉపయుక్తంగా ఉంటుంది.

ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్ల ప్రభావం

ఆకుమచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్ల పూత సమయంలో ఆశిస్తాయి. వర్షాలు, పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో ఈ తెగుళ్ల విజృంభిస్తాయి. లేత ఆకులు, రెమ్మలు, పూలను ఆశించి నష్టపరుస్తాయి. ఆకుల మీద గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి ఆకులు త్వరగా పండుబారి రాలి పోతాయి. రెమ్మల పైన నల్లని మచ్చలు ఏర్పడి పూల గుత్తులు, పూలు మాడిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం పూత దశకు ముందే ఎండిన కొమ్మలను కత్తిరించి తగుల బెట్టాలి. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డో మిశ్రమం కలిపి పిచికారి చేయాలి.

చెట్లకు పూత వచ్చే దశ

మామిడి చెట్లకు సాధారణంగా జూలై, ఆగస్టు మాసాల్లో ఇగుర్లు వచ్చి ముదురుతాయి. ఇగుర్ల రెమ్మల్లో నుంచి పూత వస్తుంది. ఆ ప్రక్రియ డిసెంబరు చివరివారం నుంచి జనవరి వరకు జరుగుతుంది. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 నుంచి 28 డిగ్రీల సెంటిగ్రేడ్, రాత్రి ఉష్ణోగ్రత 10 నుంచి 13 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటేనే చెట్లకు పూత ఏపుగా వస్తుంది. ఒక వేళ వాతావరణ పరిస్థితుల్లో తేడా ఏర్పడితే పూతలో మార్పులు ఉంటాయి. అందు చేత పూత రావడానికి రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి.


గానుగ నూనె తయారు చేస్తున్న నిర్వాహకుడు అనిల్

రసాయనాలు లేని స్వచ్ఛమైన వంట నూనెల తయారీ

గానుగ నూనెకు కేరాఫ్ కోట

ఖిలా వరంగల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పురాతన కాలంనాటి పద్ధతిలో ఎలాంటి రసాయనాలు లేకుండా స్వచ్ఛమైన వంట నూనెలకు కేరాఫ్‌గా నిలుస్తోంది వరంగల్ కోట. ఇక్కడ పల్లి, నువ్వులు, కుసుమ, సన్‌ఫ్లవర్ నూనెలను సంప్రదాయ పద్ధతిలో గానుగపట్టి తీస్తున్నారు. మధ్యకోటలో ఎద్దుల ద్వారా గానుగ తిప్పి నాణ్యమైన వంటనూనెలను తయారు చేస్తున్నారు. ఈ చిన్న పరిశ్రమను మధ్యకోటలో 10 గుంటల భూమిలో సుమారు రూ. 12 లక్షల వ్యయంతో 2 గానుగలు, 1 రేకుల షెడ్డు, 1 గది, 1 జత ఎద్దులు, ఇద్దరు పనివాళ్ళతో గతనెలలో ప్రారంభించారు. ప్రస్తుతం ఖిలావరంగల్‌తో పాటు ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, గిర్మాజీపేట, వరంగల్ తదితర ప్రాంత ప్రజలు ఇక్కడి నూనెలను విరివిగా వినియోగిస్తున్నారు.


గానుగ పట్టి తీసిన పల్లి, నువ్వులు, కుసుమ, కొబ్బరి, పొద్దుతిరుగుడు నూనెలు

తయారీ పద్ధతి

12 కిలోల పల్లీలు, నువ్వులు, కుసుమ, కొబ్బరి, సన్‌ఫ్లవర్ తదితర గింజలను గానుగలో పోసి 3 గంటల పాటు గానుగ పట్టితే 5 కిలోల నూనె వస్తుంది. 1 కిలో నుంచి 5 కిలోల వరకు పల్లినూనె, నువ్వులనూనె, కుసుమ, సన్‌ఫ్లవర్, కొబ్బరినూనెలను హోల్‌సేల్, రిటేల్‌గా రూ.450 నుంచి రూ.600 వరకు అమ్ముతున్నారు. డోర్‌డెలివరీ సౌకర్యాం కూడా ఉందని, నగరవాసులకు ఉచితంగా సరఫరా చేస్తామని నిర్వాహకుడు అనిల్ తెలిపారు.

- వృద్ధులు, దివ్యాంగులకు నిత్యం భోజనం
- సకల సౌకర్యాలతో శ్మశానవాటిక ఏర్పాటు
- పేదలకు అండగా నిలుస్తున్న మోక్షారామం ఫౌండేషన్
- రామా శ్రీనివాస్ పేరుపై కొనసాగుతున్న సేవలు

అమ్మ ఒడి అక్షయ పాత్ర


శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న ఫౌండేషన్ వలంటీర్లు

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'వృద్ధులు, దివ్యాంగులకు పట్టెడన్నం పెడితే పరమాత్ముడు సంతోషిస్తాడు' అని తల్లి చెప్పిన మాటను కొడుకు శిరసావహించారు. తన చివరి శ్వాస వరకు కూడా సేవలను కొనసాగించారు. తన మరణానంతరం కూడా సేవా కార్యక్రమాలు కొనసాగేవిధంగా తగిన ఏర్పాట్లు చేశారు. ఆయనే ప్రముఖ వ్యాపారవేత్త రామా శ్రీనివాస్. వరంగల్ నగరం 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, నిరంతర దానశీలి స్వర్గీయ రామా శ్రీనివాస్ 2016లో మోక్షారామం ఫౌండేషన్‌ను స్థాపించారు. నాటి నుంచి నిరుపేదలకు ప్రతీ రోజు రెండు పూటలా భోజనం అందుతూనే ఉంది.

ప్రతీ రోజు వృద్ధులకు భోజనం

అమ్మఒడి భవనం నుంచి ప్రతీ రోజు దాదాపు 100 మంది వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలకు మోక్షారామం ఫౌండేషన్ ప్రతీరోజు రుచికరమైన భోజనాన్ని అందిస్తోంది. సంస్థ వలంటీర్లు రెండు పూటలకు భోజనాన్ని క్యారియర్‌లో తీసుకెళ్లి అందజేస్తా రు. ఏడాదంతా సేవలు కొనసాగుతున్నా యి.

శ్మశాన వాటిక అభివృద్ధి

రామన్నపేటలోని మోక్షారామం (శ్మశాన వాటిక)ను దాదాపు రూ.కోటితో అభివృద్ధి చేశారు రామా శ్రీనివాస్. ఇల్లు లేని నిరుపేదల కుటుంబ సభ్యులు ఎవరైనా మృతి చెందితే వారి కోసం రెండు రూములు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించారు. మరీ నిరుపేదలైతే దహన సంస్కారాలకు కూడా ఫౌండేషన్ నుంచి ఆర్థిక సహాయం అందిస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం ఎంతమంది ఉన్నా వారికి ఉచితంగా భోజనం అందిస్తున్నారు.

సేవలకు మారుపేరు మోక్షారామం

గత ఏడాది భారీ వర్షాలకు రామన్నపేట, హంటర్‌రోడ్డు ప్రాంతాలు వరద నీటిలో మునిగిపోగా ఫౌండేషన్‌నుంచి ప్రజలకు ప్రతీ రోజు భోజనం, పాలు, మందులు అందజేశారు. ప్లాస్టిక్ వాడకూడదని ఇంటింటికీ డస్ట్‌బిన్స్ బట్ట సంచులను ఉచితంగా అందజేశారు. కరోనా సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మాస్కులను తయారు చేసి అందరికీ ఉచితంగా పంచారు. 200 రోజుల పాటు ప్రతీ రోజు ఆస్పత్రుల్లోని రోగులు, సహాయకులు, పోలీసు సిబ్బంది, బస్టాండ్ ప్రాంగణాల్లో నిరుపేదలకు రోజుకు వెయ్యిమందికి ఆహార ప్యాకెట్లను అందజేశారు. ఆలయాలకు, వివాహాలకు, అభాగ్యులు, పాఠశాలలకు ఆర్థిక సాయం అందించారు.


రెడ్ క్రాస్ వారికి మాస్క్‌లు అందజేస్తున్న రామా శ్రీనివాస్ (ఫైల్)

తాను నిర్మించిన శ్మశాన వాటికలోనే..

తన తల్లి మాటపై రామన్నపేట శ్మశాన వాటికను రూ.కోటి ఖర్చు చేసి వైకుంఠధామంగా తీర్చిదిద్దారు రామా శ్రీనివాస్. అయితే 11 నెలల కిందట ఆయన గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. దీంతో ఆయన పార్థివదేహానికి ఆయన కలల స్వప్నమైన మోక్షారామంలోనే అంత్యక్రియలు చేశారు. ఆయన అంతిమయాత్రకు వేలాది మంది ప్రజలు తరలి వచ్చారు.

చనిపోయినా ఆగని సేవలు

రామా శ్రీనివాస్ మృతి చెందిన రోజు కూడా ఆయనకు టుంబ సభ్యులు సేవా కార్యక్రమాలు ఆపలేదు. యథావిధిగా నిరుపేదలకు భోజనం అందించారు. ఫౌండేషన్ వలంటీర్లు దుఃఖసాగరంలో ఉండి కూడా భోజనం తయారు చేసి అందజేశారు. నిరంతరం ఆయన ఆశయాలను కొనసాగిస్తామని ఫౌండేషన్ వలంటీర్లు, కుటుంబ సభ్యులు చెబు తున్నారు.


చెత్త డస్ట్ బిన్‌లను ఉచితంగా అందజేస్తున్న వలంటీర్లు


అమ్మఒడి భవనంలో ఆన్‌లైన్‌లో సేవలు నమోదు చేస్తున్న ఎమ్మెల్యే కొండా సురేఖ (ఫైల్)


ప్రతీ రోజు అమ్మఒడి వద్దకు వచ్చి భోజనం చేసే వృద్ధులు

పీఎం శ్రీతో పాఠశాలలకు కొత్త రూపు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :సర్కారు బడులను ఆధునిక పరిశోధనా కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రేజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద 2024-25 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు మొత్తం రూ. 63,10,500 నిధులు మంజూరయ్యాయి. ఇందులో మొదటి దఫాలో హనుమకొండ జిల్లాకు రూ. 4, 56,500 రెండో దఫా ఉమ్మడి జిల్లాకు రూ. 45, 40,000 మంజూరయ్యాయి. వీటితో పాటు ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు వార్షిక గ్రాంట్‌గా మరో రూ. 13,46,000 విడుదల చేసింది.


పీఎం శ్రీ పథకం ద్వారా నిధులు మంజూరైన దామెరలోని ఎంపీపీఎస్

నిధులు విడుద లయ్యాయి. కాగా హనుమకొండ జిల్లా లోని పరకాలలోని జడ్పీహెచ్ఎస్‌లో రూ.13,50, 000 అంచనా వ్యయంతో అదనపు గదుల నిర్మా ణాన్ని చేపట్టగా ఇప్పటి వరకు రూ. 2,91,125 విలువైన పనులు చేశారు.

ఆవిష్కరణల దిశగా..

పీఎం శ్రీ పథకం కింద విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తిని పెంపొందించి, ప్రయోగశాలల్లో నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు ఈ నిధులను ప్రధానంగా వినియోగిస్తారు. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో ల్యాబ్‌లతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట వేస్తూ వృత్తి విద్యా కోర్సులను అందిస్తారు. మొత్తం నాలుగు విడతలుగా నిధులు మంజూరవుతాయి. మొదటి, రెండో విడత నిధులు రెండు రోజుల క్రితమే మంజూరయ్యాయి. పీఎం శ్రీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2022లో ప్రారంభించింది. వీటికి 2023 సంవత్సరం నుంచి నిధులను కేటాయిస్తున్నారు. మొదటి విడతగా హనుమకొండ జిల్లాలో రెండు పాఠశాలలను ఎంపిక చేశారు. రెండవ విడతలో హనుమకొండ జిల్లాలో ఒకటి, జనగామ జిల్లాలో ఒకటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకటి, ములుగు జిల్లాలో మూడు, వరంగల్ జిల్లాలో రెండు పాఠశాలలు ఎంపికయ్యాయి.

మొదటి దఫా..

పీఎం శ్రీ పథకం కింద మొదటి దశలో ఒక్క హనుమకొండ జిల్లాకే రూ.4,24,500 నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తంలో టీఎల్ఎం గ్రాంట్ కింద (ప్రీ ప్రైమరీ గ్రాంట్) కింద రూ 24 వేలు, రికరింగ్ గ్రాంట్ (ప్రీ ప్రైమరీ) కింద రూ. 4లక్షలు మంజూరయ్యాయి. ఇందులో ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌కు రూ. 2,14,500 దామెర ఎంపీపీఎస్‌కు రూ. 2, 10,000 మంజూరయ్యాయి.

రెండో విడతలో..

ఉమ్మడి జిల్లాలోని సర్కారు బడులకు రూ. 45,40,000 మంజూరయ్యాయి. ఇందులో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అక్కంపేట ఎంపీపీఎస్‌కు రూ. 4,54,000 జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలంలోని నేలపోగుల ఎంపీయూపీఎస్‌కు రూ.4,54,000, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ముత్తారం మండలం మహదేవ్‌పూర్‌లోని యమ్మనపల్లి ఎంపీపీ పాఠశాలకు రూ. 4,54,000, ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎంపీపీ స్కూల్‌కు రూ.454,000, వెంకటాపూర్ మండలం నారాయణపూర్ ఎంపీయూపీఎస్‌కు రూ. 4,54, 000, బెస్తగూడెం ఎంపీయూపీఎస్‌కు రూ 4,54, 000, వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట ఎంపీపీకి రూ.4,54,000 వర్ధన్నపేట మండలం ఎల్లంద ఎంపీపీకి రూ.4,54,000 నిధులు మంజూరయ్యాయి.

వార్షిక గ్రాంట్

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు 2024-25 సంవత్సరానికి గాను పీఎం శ్రీ వార్షిక గ్రాంట్‌గా మొత్తం రూ 13,46,000 విడుదల య్యాయి. ఈ మొత్తంలో హనుమకొండ జిల్లా కు రూ.3,48,750, వరంగల్ జిల్లాకు రూ.2,86, 750, జనగామ జిల్లాకు రూ. 2,71,750, మహ బూబాబాద్ జిల్లాకు రూ. 1,13,750, జయ శంకర్ భూపాలపల్లి జిల్లాకు రూ. 1,62,750, ములుగు జిల్లాకు రూ.1,62,750

పీఎం శ్రీ లక్ష్యం

జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసేందుకు వీలుగా ఇప్పటికే ఉన్న పాఠశాలలను మెరుగుపరచడం, ప్రతీ విద్యార్థి శ్రేయస్సును, భద్రతను ప్రోత్సహించడం, విభిన్న అభ్యాస అనుభవాలను అందించడం, పాఠశాలల్లో నాణ్యమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ఈ పథకం ప్రాథమిక లక్ష్యం. పీఎం శ్రీ కింద మంజూరైన నిధులను ప్రధానంగా స్మార్ట్ క్లాస్ రూంలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, వొకేషనల్ ల్యాబ్‌లు, స్కిల్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో సహా అత్యుత్తమ తరగతి ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ఖర్చు చేస్తారు.

మీ కోసం

- ఆధునిక ల్యాబ్‌ల ఏర్పాటు
- కొత్త ఆవిష్కరణలకు చేయూత
- విద్యార్థుల్లో నైపుణ్యానికి పెద్దపీట
- ఉమ్మడి జిల్లాకు రూ.63.10 లక్షలు మంజూరు
- మొదటి, రెండో విడతల్లో చేపట్టనున్న పనులు


పీఎం శ్రీ పథకానికి ఎంపికైన పరకాల, ఒంటిమామిడిపల్లి జడ్పీహెచ్ఎస్‌లు

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం


చిట్యాలలో పాల్గొన్న ఎంఈవో, చిన్నారులు

చిట్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి ఎంఈవో కోడెపాక రఘుపతి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ఐఈఆర్పీ సంద మహేందర్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, పీడీ సాంబమూర్తి, బండారి సదయ్య, స్పెషల్ ఎడ్యుకేటర్ ఉపాధ్యాయుడు రాజేష్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్ (డిసెంబరు) : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ హెడ్‌మాస్టర్ రాజిరెడ్డి దివ్యాంగుల గురించి మాట్లాడారు. జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ స్కూల్ హెడ్‌మాస్టర్ సరిత, ఎంపీపీఎస్ మహదేవపూర్ హెడ్‌మాస్టర్ కల్యాణి, ఉపాధ్యాయులు, ప్రభాకర్ , అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

• ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలను ప్రతి ఒక్కరూ అన్నివిధాలుగా ప్రోత్సహించాలని స్థానిక తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ములుగులోని ఎంపీడీవో కార్యాలయ సమావేశపుహాల్‌లో మంగళవారం ఎంఈవో శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగవైకల్యం అనేది శరీరంలో ఉంటుంది కాని మనసుకు కాదని అన్నారు. అందరు పిల్లలతో సమానంగా దివ్యాంగ పిల్లలు శ్రద్ధగా చదువుతూ అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, సీఆర్పీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి కొయ్యడ మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముందుగా వికలాంగులకు ఆటలు నిర్వహించి విద్యాశాఖ అధికారి మల్లయ్య చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మల్లయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల విద్యాబోధన కోసం ప్రతి రోజు భవిత సెంటర్‌కు విద్యార్థులను పంపించాలని దివ్యాంగుల విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. (ఇన్ క్లూసివ్ ఎడ్యుకేషన్ టీచర్స్) ఐఆర్పీలు దివ్యాంగుల విద్యాభ్యాసంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం వి. సంబశివరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ టీచర్లు సతీష్, రమేష్, స్వరూప, సీఆర్పీ శ్రీధర్‌నాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

• వాజేడు : మండలంలోని కాచారం ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఎంఈవో టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాంబాబు, లక్ష్మి, ఐఈఆర్పీ దుర్గానంద్ పాల్గొన్నారు.

మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సమగ్ర శిక్షణ ద్వార ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు వివరించారు. అలాగే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల, పోటీల్లో విజేతలకు బహుమతులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, ఉపాధ్యాయులు శాంతిలత, స్పెషల్ ఎడ్యూకేటర్ ప్రగతి, ఐఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

• మంగపేట (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. మంగపేట, కమలాపురం, మల్లూరు, రాజుపేట, బ్రాహ్మణపల్లి, కోమటిపల్లి, తిమ్మంపేట, నర్సింహసాగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. దివ్యాంగ విద్యార్థులకు వివిధ ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను స్థానిక ఎమ్మార్సీ భవనంలో అందజేశారు. ఎంఈవో మేనక, తిమ్మంపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ, కమలాపురం, మంగపేట, రాజుపేట హెచ్ఎంలు గడ్డం శ్రీనివాస్, గడ్డి శ్రీనివాస్, ఎమ్మార్సీ సిబ్బంది డి.శ్రీధర్, బాలకృష్ణ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీల్

సీఎం యువ వికాస్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

కాటారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహిస్తున్న యువ వికాస్ నిరుద్యోగ విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహించనుండగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితర మంత్రులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కాకతీయఖని: పెద్దపల్లి జిల్లా కేంద్రంలోజరగనున్న యువ వికాస సభను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పసునూటి రాజేందర్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మహిళా, రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నిరసన

మహదేవపూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఆధ్వర్యంలో వర్గీకరణ వ్యతిరేకుల దిష్టిబొమ్మతో మంగళవారం నిరసన తెలిపారు. మండలంలోని ప్రధాన చౌరస్తా మీదుగా శవయాత్ర తీశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ మాట్లాడుతూ. రాజకీయ పబ్బం కోసం పార్టీలు మారే ఘనత ఎమ్మెల్యే వివేక్ కుటుంబానిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు తుడిచర్ల, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు జిల్లెల నాగరాజు, ఎమ్మార్పీఎస్ మండల యువసేన అధ్యక్షులు రవితేజ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు కొయ్యల భాస్కర్, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి లింగాల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రామప్పలో మహా రుద్రయాగం

వెంకటాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్ప దేవాలయంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా బుధవారం మహారుద్ర యాగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బిల్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటలకు వేదపండితులచే మహారుద్ర యాగం నిర్వహించనుననట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

విదేశాల్లో చదివేందుకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అమెరికా, ఆస్ట్రేలియా, లండన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టరేట్ చదువుకునేందుకు జిల్లాలోని అర్హులైన ముస్లిం, క్రిస్టియన్లు, బుద్దులు, సిక్కులు, జైనులు, పార్సీలు దరఖాస్తు చేసుకోవాలని అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ జిల్లా అధికారి సీహెచ్.రవీందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబరు కాలంలో అడ్మిషన్ తీసుకున్న అభ్యర్థులు ఈనెల 31లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. తెలంగాణ ఈ పాస్.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు పత్రాలను 2025 జనవరి 1లోపు ములుగులోని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

శ్రీకాంతాచారి త్యాగం మరువలేనిది


శ్రీకాంతాచారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏటూరునాగారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీకాంత్‌చారి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో శ్రీకాంత్‌చారి చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ.. 2009లో కేసీఆర్ అరెస్టును నిరసిస్తూ శ్రీకాంత్‌చారి చేసిన త్యాగం తెలంగాణ ఉద్యమానికి నూతన శక్తిని అందించిందని తెలిపారు. ఆయన మృతి తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచిందని, ప్రత్యేక రాష్ట్రం సాధనలో ఆయన త్యాగం చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమాలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ. ఖలీల్ ఖాన్, పీఏస్‌పీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గద్దల నవీన్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి

• టీఎస్‌యూటీఎఫ్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల స్పౌస్ బదిలీల్లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు నక్కతిరుపతి, ప్రధాన కార్యదర్శి శనిగరపు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొందరు ఉపాధ్యాయులు స్పౌస్ పాయింట్లను దుర్వినియోగం చేసి వారికి అనుకూలమైన ప్రాంతాలను కోరుకున్నారని, దీంతో మిగతా ఉద్యోగులు నష్టపోయారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. భర్త పనిచేసే బడిని లేదా భార్య పనిచేసే బడిని వారికి దగ్గరి బడిని ఎన్నుకోవాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినప్పటికీ నిబంధనలను పట్టించుకోకుండా అనుకూల పాఠశాలలకు వెళ్లారని ఆరోపించారు. ఇందుకు డీఈవో కార్యాలయంలోని ఓ ఉద్యోగి సహకరించారని విమర్శించారు.

స్వయం సహాయక బృందాలదే కీలక పాత్ర

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో 14 స్వయం సహాయక సంఘాలకు రూ. 1.66 కోట్లు, 75 మంది వీధి వ్యాపారులకు రూ.22.50 లక్షల బ్యాంకు రుణాల చెక్కులను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక బృందాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోకీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి బ్యాంక్ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మునిసిపాల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటే సహించం

రైతులను దోచుకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మిల్లర్లను హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి రెవెన్యూ, డీఎస్‌వో, డీఎం, డీపీవో, మార్కెటింగ్, మిల్లర్లతో ఎమ్మెలే సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందికి గురిచేయొద్దని అన్నారు. ఈకార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయితా ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఎస్‌వో శ్రీనాథ్, డీఎం రాములు, డీసీవో వాలియానాయక్, డీఆర్డీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ పనుల పరిశీలన

భూపాలపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7,8వ తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ముస్తాబవుతున్న స్విమ్మింగ్ పూల్ పనులను భూపాల పల్లి సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళ వారం పరిశీలించారు. పట్టణంలోని అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో గల స్విమ్మిపూల్‌ను రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 మంది హజరవుతారని తెలిపారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొమురయ్య, అనిల్, రవీందర్, స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు రమేష్, శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్‌లు పాక శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు కారోబార్ల వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కారోబార్లు

మల్హర్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌ను కారోబార్లు కోరారు. తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయితీ కారోబార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిప్రతాన్ని అందించారు. హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రులను ఈ మేరకు మంగళవారం కలిశామని రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ తెలిపారు. జీపీ సిబ్బందికి శాపంగా మారిన జీవో 51ను రద్దు చేసి కారోబార్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని, జీవో 60 ప్రకారం వేతనాలు అందించాలని కోరామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వామి, పాషా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోడురులకు పట్టాలు అందించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోడు సాగుదారులకు పూర్తిస్థాయిలో పట్టాలు అందించాలని, ఎలాంటి షరతులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ములుగులో మండల కార్యదర్శి ముత్యాల రాజు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం జరిగింది. ముందుగా ఇటీవల అసువులుబాసిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.బాల మల్లేష్‌లకు సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఎలాంటి షరతులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు ఎమ్డీ.అమ్జద్‌పాషా, బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, బోడ రమేష్, మర్రి స్వామి, ఈసం మహేందర్, వట్టం సమ్మయ్య, కట్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మంగపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యేలా వివరించి చైతన్య పరచాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పర్యటించి పార్టీ దశ,దిశలను నిర్ధారించారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, నాయకులు వల్లెపల్లి శివప్రసాద్, జగన్మోహన్‌రెడ్డి, పూజారి సురేందర్‌బాబు, ఆదినారాయణ, మల్లయ్య, ఇదయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఆశా కార్యకర్తల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

చిట్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల కమిటీ ఆధ్వర్యంలో ఒడితల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మౌనికకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం బాధ్యులు రాధిక, లక్ష్మి మాట్లాడుతూ గతేడాది సమ్మెకాలంలో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రానున్న అసెంబ్లీ సమావేశంలో ప్రభుత్వం ఈమేరకు బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. పని భారం తగ్గించి, పారితోషకం లేని పనులను అప్పగించకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా బెనిఫిట్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సునీత, కళ్యాణి, కల్పన, ఆదిలక్ష్మి, ప్రమీల, బాగ్యలక్ష్మి, లావణ్య, సుమలత, శోభ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం వైద్యఆరోగ్య,పోలీస్, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ పీసీఅండ్‌పీఎన్డీటీ, మాతా శిశు మరణాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాంనగర్, కాళేశ్వరం, చిట్యాల, మహాముత్తారం ప్రాంతాల్లో లింగనిష్పత్తి తక్కువగా ఉందని ఆప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీంలు, స్వచ్ఛంద సంస్థల టీంలు నిరంతం తనిఖీలు చేపట్టాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రాలపై కేసులు నమోదు చేయాలన్నారు. తొలికాన్పుతో ఆడపిల్ల పుడితే రెవడో కాన్పులో ఆడపిల్లే పుడుతుందని గర్భవిచ్ఛిత్తి చేస్తున్నారని , తొలికాన్పులో అమ్మాయిలు పుట్టిన కుటుంబాలను గుర్తించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. సిటీ స్కానింగ్ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మధుసూదన్,డిప్యూటి డీఎంహెచ్‌ఓ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

వెంకటాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐదు ఎడ్లబండ్లలో అక్రమంగా తరలిస్తున్న రూ.2లక్షల విలువచేసే కలపను ఫారెస్టు అధికారులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మండలంలోని నారాయణపూర్ అటవీ ప్రాంతం నుంచి కలపను తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న ములుగు అటవీ రేంజ్ అధికారి డోలి శంకర్ సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతానికి చేరుకున్నారు. ఈక్రమంలో నారాయణపూర్ ఎర్రచెరువు వద్దకు చేరుకో గానే కలప బండ్లు తారసపడడంతో వాటిని స్వాధీనం చేసుకుని ములుగు రేంజ్ కార్యాల యానికి తరలించారు. ఈదాడిలో బీట్ ఆఫీసర్ రజిత, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్ దారుణ హత్య

మట్టెవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరం గల్ నగరంలో బ్యాంకు రిటైర్డు మేనేజర్ ఎలిగేటి రాజమోహన్ హత్యకు గురయ్యారు. కాళ్ల చేతుల ను గొలుసులతో కట్టేసి రంగంపేటలో కారులో మృతదేహాన్ని వదిలివెళ్లారు. మట్టెవాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ శ్రీనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్ కు చెందిన ఎలిగేటి రాజమోహన్ (64) ఆంధ్రప్ర దేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో మేనేజర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. 2021లో భార్య మృతి చెంద డంలో ఒక్కరే నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా, పెద్ద కుమార్తె శిరీష అమెరికాలో, చిన్న కుమార్తె స్ఫూర్తి హైదరాబాద్ లో ఉంటున్నారు. సోమవారం రాత్రి పెద్దకుమార్తె శిరీష. తండ్రికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవ డంతో ఇంటి సమీపంలో ఉన్న మిత్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. వారు ఇంటికి వెళ్లి చూశారు. రాజమోహన్ ఇంట్లో లేరని, కారు కూడా లేదని శిరీషకు చెప్పారు. తర్వాత రాత్రి 12 గంటల కు రాజమోహన్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ అయింది. ఈ విషయమై ఫిర్యాదు చేసేందుకు రాజమోహన్ మిత్రులు మంగళవారం ఉదయం సుబేదారి పోలీ స్‌స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే వరంగల్ రంగంపేట పాత ఏకశిల హోటల్ సందులో ఓ కారులో మృత దేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా వారికి సమాచా రం అందింది. వెంటనే వెళ్లి పరిశీలించారు. మృత దేహం రాజమోహన్‌దేనని గుర్తించారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిషేధం, నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష అన్నారు. ములు గులోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల/కళాశాలలో మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ అధ్యక్షతన జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లా డారు. మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తూ కుటుంబాలకు తీవ్ర సమస్యలు కలిగిస్తుందని అన్నారు. బాలల సంక్షేమ సమితి సభ్యుడు దామోదర్ మాట్లా డుతూ మాదకద్రవ్యాల వల్ల యువత విద్యను నిర్లక్ష్యం చేస్తూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లా ఆస్పత్రి సైకాలజిస్ట్ నమ్రత మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కారణంగా మానసిక సమస్యలు, ఆత్మవి శ్వాసం కోల్పోవడం, డిప్రెషన్, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడుతాయని అన్నారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, ఉపా ధ్యా యులు, హెల్పింగ్ హ్యాండ్ సంస్థ థెరపిస్ట్ రజిత, కౌన్సిలర్ మనోజ్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డి నేటర్ నరేష్, సోషల్ వర్కర్ జ్యోతి, సూపర్‌వైజర్ విక్రమ్, కౌన్సిలర్ రజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి

రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

మహబూబాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకున్నప్పుడే ఉన్నత స్థానాల్లో ఉంటారని రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు అన్నారు. ప్రభుత్వం విద్యావ్యవస్థల్లో సంస్కరణలు తీసుకురావడానికి రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యుడు విశ్వేశ్వర్‌రావు మంగళవారం మహబూబాబాద్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ హైస్కూల్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. గూడూరు, మహబూబాబాద్ మండలంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకులం, కస్తూర్బా గాంధీ బాలికల గురుకులం, ఎస్సీ బాలికల హాస్టల్‌ను, మైనార్టీ బాలుర గురుకులం, ఆశ్రమ పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లోని ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గృహాల్లో డైనింగ్ హాల్, స్టడీ రూం, వంటగది పరిసరాలను సందర్శించారు. ఆపై వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు పాఠశాలల్లో రికార్డులు, రిజిస్టర్లు, బాత్‌రూంలు, డార్మిటరీ రూమ్స్‌లను క్షుణ్ణంగాపరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ పిల్లలకు అందించే ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అన్నిరకాల ప్రమాణాలు పాటిస్తూ గడువు తేదీ ముగిసిన సరుకులను ఉపయోగించకూడదని చెప్పారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభ్యసన, సామార్థ్యాలను పరిశీలించారు. వారిజీవితంలో ఏమౌతారని ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. ఇప్పట్నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకుని బాగా చదువుకోవాలని సూచించారు. తొలుత మహబూబాబాద్‌కు వచ్చిన విశ్వేశ్వర్‌రావుకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ స్వాగతం పలుకుతూ మొక్కను బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈవో రవీందర్‌రెడ్డి, మానుకోట ఆర్డీవో కృష్ణవేణి, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారి నర్సింహస్వామి, ఎస్టీ సంక్షేమ అధికారి సైదానాయక్, మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్, విజయకుమారి, రజినీదేవి, సునీత, రాధిక పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఎస్సీడబ్ల్యూడీవో

కాటారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారి సునీత మంగళవారం సందర్శించారు. రెండు, మూడు రోజులుగా విద్యార్థినులు భయాం దోళనలకు గురై ఒకరిద్దరు అస్వస్థత పాలవడంతో సాంఘిక సంక్షేమ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో ఎస్సీడబ్ల్యూడీవో సునీత మాట్లాడి వారి భయాందోళనలపై ఆరా తీశారు. హాస్టల్ సిబ్బందిలో ఒకరు దేవరపూని గదుల తలుపులు కొట్టడంతో పాటు మేకను బలివ్వాలంటూ కేకలు వేయడంతో తాము భయాందోళనలు చెందినట్లు వారు వెల్లడించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

మూఢనమ్మకాలు నమ్మొద్దని, భయపడొద్దని అధికారులు విద్యార్థినులకు ధైర్యం చెప్పారు. హాస్టల్ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సీడబ్ల్యూడీవో సునీత తెలిపారు. విద్యార్థినుల భయాందోళలకు కారణమని చెబుతున్న సిబ్బందిలో ఒకరిని వారం రోజుల పాటు హాస్టల్‌కు రావద్దని సూచించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో భవాని, వైద్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ఎస్సీ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల భయాందోళనకు కారణమైన హాస్టల్ సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు స్మరణ్, కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. హాస్టల్‌ను సందర్శించిన ఎస్సీడబ్ల్యూడీవో సునీతతో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోవాలని, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కుంటున్న సమస్య లను పరిష్కరించాలన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

గోవిందరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మండలకేంద్రంలో ఈ నెల 6, 7తేదీల్లో జరిగే సీపీఎం ములుగు జిల్లాస్థాయి మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సామ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో ఏ ఒక్కటి సరిగా అమలు చేయలేదని అన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ, మహిళలకు ప్రతినెలా రూ.2500, రైతు భరోసా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, వృద్ధులకు రూ.4వేల పించన్ ఇస్తానని ఇప్పటివరకు అమలుచేయలేదని అన్నారు. అదేవిధంగా అన్నిరకాల వరిపంటకు బోనస్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి రాబోయేరోజుల్లో ప్రజా ఉద్యమాలు నిర్వహిం చేందుకు మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమా వేశంలో తెలంగాణ రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

కన్నాయిగూడెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీపీఎంవో సంజీవ్‌రావు అన్నారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పిస్తూ మండలంలోని గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. అనంతరం సిబ్బందికి డిసెంబరు 2 నుంచి 15 వరకు జరుగు లెప్రెసీ ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 కల్లా కుష్ఠు వ్యాధిని నిర్మూలించే దిశగా క్యాంపెయిన్ సాగుతోదని వివరించారు. లెప్రెసీ వ్యాది గ్రస్థులను త్వరగా గుర్తించడం ద్వారా అంగవైకల్యం రాకుండా చూడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్, రవీష్, సూపర్‌వైజర్ రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.